క్లుప్తంగా

25న మెగా జాబ్‌మేళా

కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 25న శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ విలేకరులకు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సీ–డప్, అలాగే డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించే ఈ మేళాలో లోటస్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరాం చిట్స్ లిమిటెడ్ ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలియజేశారు. కనీస విద్యార్హత ఇంటర్, డిగ్రీ పాస్ అయి 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8142509017 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయండి



గుంతలుగా మారిన నగరి రోడ్డు

నింద్ర: మండలంలోని నగరి–నాగలాపురం రోడ్డు గుంతలుగా మారింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ద్విచక్ర వాహనదారులకు ఆ గుంతలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నెట్టేరి, షుగర్ ఫ్యాక్టరీ, చవరంబాకం, మిట్టకండ్రిగ గ్రామాల వద్ద గుంతలు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



ప్రథమ బహుమతి పొందిన విద్యార్థినులు

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం, పాలసముద్రం హైస్కూల్ విద్యార్థులు వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ చాటారని హెచ్‌ఎంలు మీనాక్షి, మురుగదాస్ తెలిపారు. బుధవారం గంగాధరనెల్లూరు హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం పోటీలో టీఆర్ పురం హైస్కూల్ విద్యార్థినులు వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి, పాలసముద్రం హైస్కూల్ విద్యార్థి మోహిత్‌కుమార్ డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ బహుమతి పొందాడని తెలిపారు. టీచర్లు వారిని అభినందించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



అఫ్జల్‌కు ఆర్థిక సాయం చేస్తున్న సహృదయ సేవా సమితి సభ్యులు

కార్వేటినగరం: అభాగ్యులకు సహృదయ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు టీ.తిరుమలయ్య అన్నారు. స్థానిక ముస్లింకాలనీకి చెందిన ధంకా అఫ్జల్ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న సంస్థ సభ్యులు బుధవారం తక్షణ సహాయం కింద వైద్యం కోసం రూ. 26 వేలను అందజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలయ్య, జయచంద్ర మాట్లాడారు. సభ్యులు న్యామతుల్లా, సర్దార్, దేవ, పన్నీర్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

పాలసముద్రం: కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ నుంచి నుంచి వైద్య సిబ్బందితో పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. కుష్టువ్యాధి లక్షణాలను తెలియజేశారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి కుష్టు సర్వే చేసి, కుష్టు అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌లో 4 సమస్యలు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు సమస్యలను తెలిపారు. మొత్తం 4 ఫిర్యాదులు వచ్చాయని డీఈలు ప్రసాద్, ఆనంద్ పేర్కొన్నారు. మీటర్ బాగు చేయాలని, మీటరు పేరు మార్చాలని, బిల్లు సవరణ, డిస్‌కనెక్ట్ అయిన సర్వీసును రీకనెక్ట్ చేయాలని వినియోగదారులు ఫిర్యాదులు చేశారన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. టెక్నికల్ ఏఈ మాధురి, జేఏఈ గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పార్క్ చేసిన వాహనాలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు



పార్కింగ్ పరేషాన్

దినదినాభివృద్ధి చెందుతున్న పుత్తూరు పట్టణంలో వాహనదారులకు పార్కింగ్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. పట్టణంలో ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేక పోవడంతో వాహనదారులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, వివిధ వాణిజ్య సముదాయాలు ఎలాంటి పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయకుండానే వెలుస్తున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేస్తున్నారు.

- పుత్తూరులో తీవ్రంగా పార్కింగ్ సమస్య
- అవస్థల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

పుత్తూరు: పట్టణ జనాభా 60 వేలకు పైగా ఉంది. మండల పరిధిలోని చుట్టు పక్కల గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అనునిత్యం వివిధ పనుల నిమిత్తం పుత్తూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. అధిక శాతం ప్రజలు ద్విచక్ర వాహనాలపై వస్తుండడంతో పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. పట్టణంలో ప్రధానంగా తిరుపతి–నగరి రోడ్డుతో పాటు కార్వేటినగరం రోడ్డు, బజారు వీధి, కాపువీధుల్లో వివిధ వాణిజ్య సముదాయాలు, వివిధ బ్యాంకులు, ఆస్పత్రులు, క్లినిక్ లేబొరేటరీలు ఉన్నాయి. అయితే ఏఒక్క వాణిజ్య సముదాయం ముందు కూడా పార్కింగ్ స్థలం లేకపోవడం గమనార్హం. ఇందుకు తోడు పట్టణంలోని ప్రతి దుకాణం ముందు ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతుండడంతో వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది. దీంతో ప్రతి ఒక్కరూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, తహసీల్దార్ కార్యాలయ ఆవరణల్లో బైక్‌లను పార్క్ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రి లోపలికి, బయటకు వెళ్లాల్సిన 108, అంబులెన్సు వాహనాలకు దారి ఉండడంలేదు. దీంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల వైఫల్యం

పట్టణంలో సంచరించే ద్విచక్ర వాహనదారుల నుంచి వివిధ రూపాల్లో జరిమానాలు వసూలు చేస్తున్న స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో విఫలమవుతున్నారు. నో పార్కింగ్ బోర్డులు పెట్టి వన్‌సైడ్ పార్కింగ్ సిస్టమ్ అని ప్రకటించిన పోలీసులు దాన్ని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. బోర్డులు ఉన్నచోటే వాహనాలు నిలుపుతున్నారు. అయినా పట్టించుకునేవారు లేరు. తిరుపతి రోడ్డు, నగరం రోడ్డులోని ప్రతి దుకాణం ముందు ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ హోదా కలిగిన పట్టణాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల సౌకర్యార్థం పార్కింగ్ కోసం స్థలాలను కేటాయించాల్సి ఉంది. అయితే ఆ దిశగా అధికారులు స్పందించకపోవడం విచారకరం. మున్సిపాలిటీ, పోలీసు, ఆర్‌అండ్‌బి అధికారులు సంయుక్తంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యేకించి ఆటోస్టాండ్లు లేకపోవడంతో ప్రధాన రోడ్లపైనే ఆటోలను నిలుపుతున్నారు. ఇకనైనా ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రైవేట్ హాస్పిటల్ వద్ద నో పార్కింగ్ బోర్డు

ఇబ్బందులు పడుతున్నాం



నేను ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం మోటర్ సైకిల్‌పై పుత్తూరుకు వస్తుంటాను. కూరగాయల మార్కెట్, కిరాణా షాపు, బ్యాంకు, హాస్పిటల్ వద్దకు వెళ్లినా బైక్ పార్క్ చేయడం పెద్ద సమస్య. ఏ దుకాణం వద్ద బైక్ ఆపినా వెంటనే పోలీసులు అక్కడి నుంచి బైక్ తీసేయాలంటూ హెచ్చరిస్తున్నారు. పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం అంటూ లేకపోవడంతోనే ఈ సమస్య. ఇందుకు అధికారులు పరిష్కారం చూపాలి.

– బాబు, ఉత్తరపుకండ్రిగ హెచ్‌డబ్ల్యూ, పుత్తూరు

సమస్యకు పరిష్కారం చూపుతాం



పట్టణంలో వన్‌సైడ్ పార్కింగ్ ఏర్పాటును ఖచ్చితంగా అమలు చేస్తాం. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రజలు సైతం ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకారం అందించాలి. ప్రతి రోజూ నిర్ణయించిన వన్‌సైడ్ పార్కింగ్ స్థలంలోనే వాహనాలను పార్క్ చేయాలి. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం.

– టి.ఓబయ్య, ఎస్‌ఐ, పుత్తూరు

పోలీసులను సంప్రదించాం



పట్టణంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యపై స్థానిక పోలీసు అధికారితో సంప్రదించాం. పట్టణంలో పార్కింగ్‌కు కేటాయించే విధంగా స్థలాల అన్వేషణ జరుగుతోంది. అలాగే దుకాణ యజమానులు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి. లేనిపక్షంతో తగిన చర్యలు తీసుకుంటాం. ఇక ముందు పోలీసులతో కలిసి సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– ఎం.మంజునాథ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో

నగరి : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవంపై ఈ పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ పోటీల్లో గేట్ పుత్తూరుకు చెందిన ఎంబి అభిరామి మొదటి బహుమతిని, వ్యాసరచన పోటీలలో విజయపురం మండలానికి చెందిన కే.నందా మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పైన, ప్రజాస్వామ్య వ్యవస్థ పైన అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలకు విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా ఈ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే



భూ సర్వే పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ జయరాజ్

శ్రీరంగరాజపురం : జిల్లాలో భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికే భూముల రీసర్వే చేస్తున్నట్టు డీఆర్‌ఓ జయరాజ్ అన్నారు. మండలంలోని 50 కనికాపురంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు భూ సమస్యలు ఉంటే రీసర్వేలో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా వేగవంతం చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, డీటీ రవీంద్రబాబు, మండల సర్వేయర్ సురేషబాబు తదితరులు పాల్గొన్నారు.

మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

పుత్తూరు: ప్రతి ఒక్కరూ మిత ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని టాటా ఆస్పత్రి డాక్టర్ వెంకయ్యబాబు సూచించారు. పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో బుధవారం రాస్ సేవా సంస్థ, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేకించి మహిళలు తమ దైనందిన జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. మహిళలు క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని సూచించారు. గత కొన్నేళ్లగా రాస్ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 110 మందికి బీపీ, షుగర్, హెపటైటిస్, మహిళలకు గొంతు, రొమ్ము, గర్భాశయం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు అమరావతి, రెడ్డికుమారి, మహేంద్ర వైద్య సేవలందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వసంతమ్మ, రాస్ సిబ్బంది తేజ, జయలక్ష్మి, ద్రాక్షాయణి ల్గొన్నారు.

కాళభైరవాష్టమి పూజలు

నగరి : స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాళభైరవ సన్నిధిలో బుధవారం కాళభైరవ అష్టమి పూజలను వైభవంగా నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం చేశారు. అభిషేకానంతరం స్వామిని విభూతితో సుందరంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు. అభిషేక పూజల్లోను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

పుత్తూరు: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని స్థానిక ఎంవీఐ పి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రైవేటు డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, కళాశాలల బస్సు, వ్యాన్ డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను విధిగా పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్‌ను విధిగా ధరించాలని స్పష్టం చేశారు. సెల్ ఫోన్ మాట్లాడరాదని, పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. వాహనాల బ్రేకులు, హారన్స్, లైట్లు వంటి పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని చెప్పారు. డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

కూటమి అరాచకాలను ఎండగడదాం

–నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కే. కృపాలక్ష్మి కోరారు. మండలానికి చెందిన ఎం. రామయ్య(జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి)గా, బట్టే సుబ్రమణ్యం(ప్రచార కమిటీ అధ్యక్షుడు), బండి హేమసుందర్ రెడ్డి(వాణిజ్య విభాగం అధ్యక్షుడు)గా నియమితులు అయిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం పుత్తూరులోని క్యాంపు కార్యాలయంలో కృపాలక్ష్మిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నేతలు, ఆయా మండలాల్లో కార్యకర్తలను సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, చేస్తున్న అరాచకాలు, దారుణాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సిద్ధమవ్వాలని చెప్పారు. ఏ కష్టమొచ్చినా కార్యకర్తలకు అండగా నిలబడతానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని కొందరు అధికారులు కూటమి నేతలతో అంటకాగి పేదల కడుపుకొట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తున్నాయని, దీనిపై కూడా పోరాటం చేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజి పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వివిధ అంశాలపై ఆరా తీశారు. అనంతరం దేవళంపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు.ఆయన మాట్లా డుతూ పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

‘గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత’



శ్రీరంగరాజపురం: మాట్లాడుతున్న డీపీఓ సుధాకర్‌రావు

శ్రీరంగరాజపురం : గ్రామాల్లో పరిశుభ్రత అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీపీఓ సుధాకర్‌రావు ఆదేశించారు. మండలంలోని 49కొత్తపల్లె, వీవీ పురం, తయ్యూరు, మెదవాడ, శ్రీరంగరాజపురం పంచాయతీలను డీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ట్యాంకులు శుభ్రం చేయడం..ఇత్యాది వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్ల పక్కన పేడదిబ్బలు, ముళ్లచెట్లను తొలగించాలని, డంపింగ్ యార్డ్‌ను వినియోగంలో తీసుకువచ్చి చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. అనంతరం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓపీఆర్‌డీ కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



నెల్లేపల్లెలో పశువులను పరీక్షిస్తున్న వైద్యులు



పెనుమూరు మండలంలో పశువులకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశు వైద్య సిబ్బంది



పాలసముద్రం: బలిజకండ్రిగలో పాడిపశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న అనిజ

గంగాధర నెల్లూరు: మండలంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య శాఖ ఏడీ మురళీమోహన్ కోరారు. బుధవారం మండలంలోని నెల్లేపల్లె, కొండేపల్లె, మహదేవమంగళంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో మొత్తం 2107 పశువులకు చికిత్స చేశామని, 165 మంది రైతులు లబ్ధి పొందారని ఏడీ తెలిపారు.కార్యక్రమంలో యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, సర్పంచులు గంగయ్య, గోవిందయ్య, వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, వంశీకృష్ణ, శ్రీనాథ్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పులికల్లు, తిరివిరెడ్డిపల్లెలో..

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలోని పులికల్లు, తిరివిరెడ్డిపల్లెలో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువైద్యాధికారి సుబ్రమణ్యం 160 పశువులకు చికిత్స చేశారు. అలాగే పిడుదుల నివారణకు బూటాక్స్ స్ప్రే చేశారు. తిరివిరెడ్డిపల్లె సర్పంచ్ కుసుమ, పులికల్లు సర్పంచ్ మమత, రైతులు పాల్గొన్నారు.

శ్రీరామాపురంలో పశువైద్య శిబిరం

నింద్ర: మండలంలోని శ్రీరామాపురంలో పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి సాయి సంధ్య తెలిపారు. ఆమె మట్లాడుతూ పశువులకు వైద్యసేవలు అందించడం వల్ల వివిధ రోగాలను నయం చేయవచ్చని అన్నారు. వివిధ రోగాలను అరికట్టేందుకు పాడి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బలిజకండ్రిగలో..

పాలసముద్రం : మండలంలోని గంగమాంబపురం పంచాయతీ బలిజకండ్రిగలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆవు, దూడలకు నట్టల నివారణ మందులు పిచికారీ చేశారు. 30 మంది పాడి రైతులకు సంబంధించి 125 పాడిపశువులకు గర్భకోశ సమస్యలపై వైద్యం చేశారు. ఉచిత పశువైద్య శిబిరాలు ఈ నెలాఖరు వరకు ప్రతి గ్రామంలో నిర్వహించనున్నట్టు పశు వైద్యాధికారిణి అనిజ తెలిపారు. కార్యక్రమంలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ గోపాలకృష్ణ, లోకయ్య పాల్గొన్నారు.